ఆ. బాందేంలేండి, అని ప్రారంభించాడు. నాకు ఒళ్లుమండింది. ఇందాకటి ఉపన్యాసమంతా లేనివాడికీ ఉన్నవాడికీ ఉండే తారతమ్యం చెప్పడంకోసం. మొన్నెవరో రెండెకరాల పొలమిచ్చి, పిల్లనిస్తానన్నాడే ఆయన కూతురు మూగది. అందుకోసం మనదాకా వచ్చాడు. లేకపోతే మనం ఏమూలుండే వాళ్ళమో! లోకందృష్ట్యా సమర్థుణ్ణి కొంతవరకూ పెళ్ళి కాలేదన్న దిగులు నాకుండదు. ఎందుకంటే పరిస్థితులను కొంతవరకైనా అర్థం చేసుకున్నా కాబట్టి” అన్నాడు రవి.

“ఆహా! ఎంత మహానుభావుడివి. లోకంలో పరిస్థితులను బాగా అర్థం చేసుకున్నవాడివి నువ్వొక్కడివే నేమో! అని వ్యంగ్యహేళనగా అంటూ “చూడు. ఇక్కడికి తొమ్మిది గంటలయి తొమ్మిది నిముషాలయింది. బాహ్య చింతన చింతనగానే ఉన్నది. ఏంచేస్తాం. నీబోటి బ్రహ్మచారిగాళ్ళు సహాధ్యాయులుగా ఉంటే ఇంకా చింతనలు కూడా సాగుతయ్” అన్నాడు గోపి నవ్వుతూ.

కథానిక

# కాంతలోని అకాంతత్వం

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

వహా రైల్వేస్టేషన్ ఎప్పుడూ కిటకిట లాడుతూనే ఉంటుంది. ఎజన్సీతో వర్తకం చేసి లాభాలు గుంజుకునేవాళ్ళూ, ఏజన్సీ నుంచి న్యాయం కోసం, విలాసంకోసం పెద్ద పట్టణాలకి వెళ్ళేవాళ్ళూ రైలు వచ్చేముందర టికెట్ కోసం కాచుకునుంటారు. దానికి తోడుగా గుమస్తా రైలు రావడానికిముందర కేవలం పావు గంట ఉందనగా టిక్కెట్లు అమ్మడం ప్రారంభిస్తాడు. అతనికి చాలా అనుభవం ఉండడం వల్ల ఎన్నిటిక్కెట్లు అమ్మడానికైనా ఆ కాలం చాలునని అతని ధైర్యం.

రాజమండ్రి వెళ్దామని ఒక శుభదినాన్ని బయలుదేరాను. నేను స్టేషన్ చేరేసరికి రైలు కింకా అరగంట టైముంది గనక రైల్వే ఉత్తరువుల ప్రకారం అంతకు అరగంట ముందే బుకింగ్ ప్రారంభించబడవలసి ఉన్నా, అది మరో పావుగంటకి కాని ప్రారంభం అవదు. అందుచేత కిటికీ దగ్గర టిక్కెట్లకోసం కూడిన మనుష్యులు తమతమ గొప్పతనాలనీ తక్కువలనీ మరిచిపోయి త్రోపులాటల్లో నిమగ్నులై గొడవ చేస్తూండగా కాస్తదూరంగా బెంచీ మీద కూర్చుని అదే చూడసాగాను.

వాళ్ళందరిలోనూ కాస్త శుభ్రంగా బట్టలు వేసుకున్న ఇద్దరు యువకులు సహజంగా నా దృష్టిని ఆకర్షించారు. త్రోపులాటలో కలియకుండా టిక్కెట్టు తీసుకోవడం ఎలాగా అని కాబోలు ఆలోచిస్తూ ఇద్దరూ కొంచెందూరంగా నిలబడ్డారు మూకకి.

అన్ని తరగతుల ప్రయాణీకులకీ అక్కడే టిక్కెట్లు దొరికేది. ఈ విధంగా త్రోపులాట లేకుండా రెండో తరగతి టిక్కెట్టు కూడా అక్కడ దొరకదు. అందుచేత ఆ యువకుల్లో ఒకాయనతో మామూలుగా సంభాషణ ప్రారంభించాను.

“ఏ వూరు వెళ్ళాలండీ?” అన్నాను చాలా దగ్గర బంధువులాగ.

“రాజమండ్రి వెళ్ళాలండీ” అన్నాడు.

“దొమ్మీ జాస్తిగా ఉంది” అన్నాను.

చికాకుతో “అదే చికాకండీ. పైతరగతులకి వేరే బుకింగ్ రూము, వెయిటింగ్ రూము లేకపోవడం చాలా న్యూసెన్స్” అన్నాడు.

రెండో యువకుడు ఈ పరిస్థితిలో ఎందుకో ప్లాటుఫారమ్ మీదికి వెళ్ళాడు.

“నేనూ రాజమండ్రే వెళ్తున్నాను. దయ ఉంచి నాకో టిక్కెట్టు తీసి పెడతారా? మీ లగేజీ నేను చూస్తూంటాను” అన్నాను.

అతనంగీకరించాడు. డబ్బు అతని చేతి కిచ్చాను.

మూక అంతా పూర్తి అయేదాకా యువకలిద్దరూ టికెట్లకోసం ప్రయత్నించలేదు. తరువాత ఇద్దరూ రాజమండ్రికి రెండేసి టికెట్లు అడుగుతూ ఒక్కసారే చెరోక వేపునించీ బుకింగ్ కిటికీ దగ్గరకి రాబోయారు. ఆ తొందరలో ఇద్దరితలలు ఢీకొన్నాయి. నాస్నేహితుడి కాలుక్రింద రెండో యువకుడి కాలుపడింది. అతను చాలా కోపిష్టిలాగ ఉన్నాడు "కళ్లు లేవూ?" అన్నాడు తీవ్రంగా-తల తడుముకుంటూ.

"కళ్లు కనిపిస్తే ఏ పొరపాటులూ రావు."

"బుర్ర ఉంటే ఏ ప్రమాదాలూ లేవు."

ఏమయితేనేం ఇలాగ రెచ్చిపోయేసరికి కలగచేసికుని విడిపించాను మరో ఇద్దరి సహాయంతో. తరువాత ఇద్దరూ చెరో రెండు టిక్కెట్లు రాజమండ్రికే తీసుకున్నారు.

ఈలోగా మెయిలు రానేవచ్చింది. హడావుడిగా లగేజీ వేయించి దగ్గరగావున్న కంపార్టుమెంటులో యెక్కాను. నా వెనకాల నా స్నేహితుడు యెక్కాడు. అతని వెనకాలే ఓ అందమైన అమ్మాయీ, ఆమె వెనకాల రెండో ఆయనా (గత సంగ్రామంలో) యెక్కారు.

కంపార్టుమెంటు ఖాళీగా ఉంది. కిటికీ ప్రక్కగా కూర్చున్నాను. రైలు కదిలింది. ఆ అమ్మాయి నా ప్రక్క కిటికీదగ్గర కూర్చుంది. ప్రక్క బెంచిమీద కొంత దూరంగా ఇద్దరు స్నేహితులూ యెక్కారు.

తీరుబాటుగా పెట్లోనించి సగం చదువుతూ విడచిన నవల తీశాను. కాని చదవకుండా ఎదురుగా ఉన్న అమ్మాయి చేతిలోని పుస్తకం మీదికి దృష్టి సారించాను. ఆమె హఠాత్తుగా పుస్తకంమీదినించి నన్ను పరీక్ష చేస్తూందని గ్రహించి సిగ్గుపడి, ఆ స్నేహితుల ముఖాల మీదికి పరీక్షకి వెళ్ళాను.

వాళ్ళిద్దరూ ఆ అమ్మాయివేపు చూస్తున్నారు. ఆమె నా దిక్కుగా చూస్తూంది. వాళ్లు ముఖాలు త్రిప్పుకుని ఒకరివేపొకరు చూసుకుని తలలు దించుకున్నారు.

ఇంతలో నా స్నేహితుడు సిగరెట్టు తీసి నా కిచ్చాడు. తరవాత ఎంతో స్నేహితుడుకిలాగా ఆ రెండో ఆయనకి ఇచ్చాడు. నేను కొంచెంఆశ్చర్యపడ్డాను. ఇంతలో ఇంత స్నేహం ఎలాగ వచ్చిందని.

రెండో యువకుడు సిగరెట్టు ముట్టించబోతూ చటుక్కున ఆగి, నా స్నేహితుడికేసి తిరిగి "ఆమెకి అభ్యంతరం లేదనుకుంటాను" అన్నాడు.

నా స్నేహితుడే ఏదో అనబోతుంటే ఆమె నవ్వుతూ, "నాకేం అభ్యంతరం లేదు. మీరు స్వేచ్ఛగా కాల్చుకోండి" అన్నది.

ఏ రమణమూర్తి కంపెనీలోనో అతని సిగరెట్లు కాల్చడం కన్న నాకు అభ్యాసమేమీ లేదు. అందుకని నేను సిగరెట్టు కాల్చడం మానేశాను. వాళ్ళిద్దరూ సిగరెట్లు కాలుస్తూ లోకాభిరామాయణం వల్లించుకుపోతున్నారు, మధ్యమధ్య ఆమెవేపు చాలా పరీక్షగా కొద్దిసేపు చూస్తూ. వాళ్ళ సంభాషణలోని ఆప్యాయత నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

ఒక స్టేషను దాటాము. ఆమె ఎటూ చూడకుండా, "ఇది ఏ స్టేషనో" అంది.

మొదటి యువకుడు ఒక క్షణం పోయాక, "అది గుళ్లిపాడు" అన్నాడు. రైలు చాలా వేగంగా సాగిపోతూంది.

ఆమె పుస్తకం క్రింద పడవేసి నావేపు పూర్తిగా తిరిగి చిన్నగా నవ్వుతూ, "అయితే నిజంగా నన్నెరుగరన్నమాట" అంది.

నన్ను కాదనుకున్నాను. తెల్లబోయి చూస్తూంటే మొదటి యువకుడికి చాలా కోపం వచ్చింది. ఆమె అతని తాలూకు అని అప్పటిదాకా అనుకుంటున్నాను. అది నిర్ధారణ చేసుకోవాలనుకున్నాను.

నసుగుతూ "మీరు ఎవరితో అంటున్నారు?" అన్నాను ఆమెవైపు తిరుగుతూ.

ఆమె చిన్నగా నవ్వి "మీతో నేనండీ... మీరు నన్నెరుగరంటే న్యాయమే. మీ అన్నయ్య పెళ్లిలో చాలా పని తొందరలో ఉండేవారు. అదీకాక, మీకు ఆడవాళ్ళంటే చాలా భయంలా ఉంది."

నేను నవ్వుదామనుకున్నాను. కాని నవ్వలేకపోయాను.

"మీ పేరు..." అని ఆపాను, ఏ భావమూ వ్యక్తం కాకుండా.

"లలిత... మీ వదినగారికి పెత్తల్లి కూతురి నన్నమాట. నేను పెళ్ళికి వచ్చి వెళ్ళడం చాలా తొందరగా అయిపోయింది. కాని మిమ్మల్ని చూసి తెలుసుకున్నాను. మీరు నన్ను జ్ఞప్తి చేసుకోలేదంటే న్యాయం ఉంది. మీ దృష్టి చాలా చెదిరిపోయి ఉంటుంది. ముఖ్యంగా ఆ సమయంలో."

ఆమె నవ్వింది లేతగా. శ్రుతి కలిపాను-పెళ్ళిలో శాంతతోనూ, శశితోనూ పరిచయం చేసుకోవడం జ్ఞప్తి తెచ్చుకుని. తరవాత ఆమె తనని గురించి పూర్తిగా చెప్పుకుంది. రాజమండ్రి వాళ్ళ నివాసం అవడమూ, కాలేజీ విశేషాలూ, చాలాచాలా. మా సంభాషణ మా రైలు చిన్నచిన్న స్టేషన్లుదాటి సామర్లకోట కిరాగా అనేక రంగాలు దాటి కాఫీమీదికి పోయింది. యువకులిద్దరూ ఇంతకు ముందు దిగారు. షాపుకిపోయి కాఫీకోసం చెప్పి నిలబడ్డాను. సంభాషణ స్ఫుటంగా వినిపించింది మా పెట్టెలోని యువకులది. వాళ్లు నన్ను చూడకుండా మాట్లాడుకుంటున్నారు.

"ఆవిడ చాలా సోషల్ వుమన్ లాగుంది" మొదటి గొంతుక.

"అదేమిటీ? మీ తాలూకు కాదూ?" రెండోగొంతుక.

"అర్రే. అయితే మీ తాలూకు కాదన్నమాట!"

"ఛా. అయినా వాడెవడో మంచి ఛాన్సే"

"వాడి మొహం. త్వాష్ట్రంలాగ ఉన్నాడు"

నాకు నవ్వాగలేదు. నేను కాఫీ త్రాగడం మానేసి నవ్వుతూ కంపార్ట్ మెంటులోకి వచ్చేశాను ఫ్లాస్కు మాత్రం నింపుకుని. ఆనవ్వులో కాఫీ త్రాగితే దేవుడు కనిపిస్తాడని నాకు తెలుసును.

"ఏమిటా నవ్వు?" లలిత తెల్లబోతోంది.

ఒక్క క్షణం తమాయించుకుని "ఏమీ లేదు. మంచి కథ జరిగింది" అన్నాను.

ఆమె ప్రశ్నార్థకంలాగ ముఖం పెట్టింది.

"మన పెట్టిలో ఎక్కిన ఆ ఇద్దరు యువకులూ మొదట జట్టీపడ్డారు. సరే ఏదో సర్దుకుని రైలెక్కాము. మా స్టేషన్లో ఎందుకో మీరు దిగారు."

"ఎందుకూ లేదు. నా క్లాస్ మేట్ ఎవరో కనిపించితే పలకరిద్దామని దిగాను. సరే ఏం జరిగింది తరవాత?"

"తరవాత ఆ యిద్దరూ మిమ్మల్ని రెండో వాడి తాలూకు వారినిగా తీసుకుని అత్యధికమైన మర్యాదలు చూపుకున్నారు. సరే నా మూలంగా రహస్యం బైటపడింది. ఇంక చూడండి అవతారం."

"వాళ్ళలాగ పొరబడ్డానికి కారణం ఏమిటో!"

"ఉంది. ఇద్దరూ రాజమండ్రికి రెండేసి టిక్కెట్లు కొన్నారు. ఒకాయన నా కోసం తీసేడు. అలాగే ఇంకొకాయన ఎవరికోసమో తీసుకుని ఉంటాడు. అంచేత ఒక్కొక్కడూ రెండోవాడి రెండో టిక్కెట్టు మీ కోసమేనని పొరబడ్డాడు."

సరే... ఈ సమయంలో మా స్నేహితులిద్దరూ వస్తూండగా ఒకాయన కాలు తడబడి రెండోవాడిమీద పడటమూ, ఆయన ప్రక్కకి త్రోయబడటమూ జరగనే జరిగింది.

"కళ్లు లేవూ?" అని కసురుకున్నాడు రెండోఆయన.

"పొరపాటుకి అలాగ బొగిలిపోతావేం?" అని ప్రథముడు.

"నోర్ముయ్."

"ఏడిశావ్."

మేము నవ్వలేక బాధపడుతూండగా, కొంతమంది పెద్దలు ఆ మహానుభావులని విడతీశారు. ఇంతలో రైలు కదులుతూండగా పరుగున వాళ్లుమా పెట్టెలో ఎక్కారు. కాని కూర్చున్న బెర్తు వదలి దూరంగా పొయ్యారు.

లలిత కొంత నవ్వు ఆపుకుని "రావుగారూ కొంతలో ప్రత్యేకత గ్రహించారా?" అన్నది చిన్నగా.

"ఔను. ఆ కొంతత్వానికి ధర్మాలని కూడా" అన్నాను.

రైలు నవ్వుకుంటూ స్టేషన్ దాటింది.